ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

జయశంకర్ **భూపాలపల్లి** 5 **ములుగు**

బుధవారం 17 జనవరి 2024

- జంపన్నవాగులో ఊరట్టం కాజ్‌వే నిర్మాణంలో డొల్లతనం!
- మేడారంలో తూతూమంత్రంగానే పనులు
- వరదలకు ధ్వంసమైనప్పుడల్లా మరమ్మతులు
- ఈసారి కూడా రూ. 25 లక్షలు వృథా అయ్యే పరిస్థితి!
- శాశ్వత పరిష్కారం ఉన్నా అవలంబించని అధికారులు
- హైలెవల్ వంతెనా కట్టాలంటున్న భక్తులు



సిమెంటు పైపులు, సీసీతో సాగుతున్న కాజ్‌వే పనులు

నిధులు నీళ్లపాలేనా..?!

మేడారం, జనవరి 16 : మహాజాతర అభివృద్ధి పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. తాత్కాలిక పనుల పేరిట కోట్లు వృథా అవుతున్నాయి. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టి సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సి ఉండగా ప్రతిసారీ తూతూమంత్రంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. జంపన్న వాగులో చేపడుతున్న ఊరట్టం కాజ్‌వే పనులే ఇందుకు నిదర్శనం. రూ. 25 లక్షలతో ఈ పనులు చేపడుతుండగా ఈసారి కూడా నిధులు వృథా అయ్యే పరిస్థితి ఉందని భక్తులు అంటున్నారు.

రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో సుమారు కోటిన్నర మంది భక్తులు తరలివస్తుంటారు. వనదేవతలకు మొక్కులు చెల్లించుకోనేందుకు భారీ సంఖ్యలో మేడారం చేరుకుంటారు. మహాజాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉంటుంది. ఈసారి ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మహాజాతర జరగనుంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం భక్తుల సౌకర్యాల కల్పనకు రూ. 75 కోట్లు కేటాయించింది. ఎన్నికల అనంతరం కొత్తగా కొలువుదీరిన రేవంత్ సర్కారు అంతే మొత్తంలో నిధులను విడుదల చేసింది. దీంతో మేడారంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే.. టెండర్ల ద్వారా పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉండగా నామినేషన్ పద్ధతిలో చేపడుతున్నారు.

వరదలు వచ్చినప్పుడల్లా..

మేడారం మహాజాతరలో భక్తుల కోసం చేపడుతున్న పనుల్లో కొన్ని విస్మయాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జంపన్నవా గులో జరుగుతున్న ఊరట్టం కాజ్‌వే మరమ్మతు పనులు ఈసారి కూడా తూతూ మంత్రంగానే సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు కాలినడకన జంపన్న వాగు దాటేందుకు ఈ కాజ్‌వే దోహదపడుతుంది. అయితే.. వరదలు వచ్చినప్పుడల్లా ఇది కొట్టుకుపోవడం, మళ్లీ జాతరకల్లా దీనికి మరమ్మతులు చేపట్టడం పరిపాటిగా మారింది.



వరదకు కూలిపోయిన ఊరట్టం కాజ్‌వే (ఫైల్)

ఊరట్టం వద్ద జంపన్నవాగును కాలి నడకన దాటేందుకు 2010 మహాజాతర సందర్భంగా రూ. 10 లక్షలతో కాజ్‌వే నిర్మించారు. 2012 మహాజాతర కల్లా వాగు వరద ఉధృతికి మేడారం వైపు కొంతభాగం ఇది కూలిపోయింది. అప్పడి నుంచి భక్తులు వాగు దాటేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మట్టిపోసి మమ అనిపించారు. ఇదే క్రమంలో 2018, 2020, 2022 జాతరలకు సీసీతో పనులు చేపట్టారు. అయినా వరదల ఉధృతికి కాజ్‌వే మరింత ధ్వంసమైంది.

శాశ్వతానికి ఆస్కారం లేదా..?!

జంపన్న వాగులో కాజ్‌వేకు ప్రత్యామ్నాయంగా ఎత్తైన వంతెన నిర్మిస్తేనే వరద తాకిడికి అది తట్టుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినా అధికారులు పాత పద్ధతినే అనుసరిస్తున్నారు. ఈసారి మహాజాతరకు కూడా తాత్కాలికంగా కాజ్‌వే పనులు చేపడుతున్నారు. ఇందుకు రూ. 25 లక్షలు వెచ్చిస్తున్నారు. తాత్కాలిక పనులు కాకుండా శాశ్వతంగా వంతెన నిర్మిస్తే ఈ నిధులు దుర్వినియోగమయ్యే దుస్థితి ఉండబోదని తెలిసినా అందుకు పూనుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. వరదలు వస్తే కొట్టుకుపోయేలా కాజ్‌వే పనులు చేపట్టడం ఏకంగా రూ. 25 లక్షలను నీళ్లపాలు చేయడమేననే విమర్శలు వస్తున్నాయి. ఈ పనులతో కాంట్రాక్టర్‌కు లబ్ధి తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని భక్తులు అంటున్నారు. ఈ పరిస్థితిని చూస్తుంటే అభివృద్ధి పనులకు అధికారులు రూపొందించిన ప్రణాళికలు కాంట్రాక్టర్ల కోసమేనా..? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ ఈ విషయంపై దృష్టి సారించడం లేదని అంటున్నారు. పనులను పరిశీలిస్తున్నారే తప్ప భక్తుల ఉపయోగాన్ని, నిధుల దుర్వినియోగాన్ని గుర్తించడం లేదంటున్నారు. అలాగే రూ. 10లక్షలు ఖర్చయ్యే ఈ కాజ్‌వే పనులకు రూ. 25 లక్షలు కేటాయించారని కూడా పలువురు ఆరోపిస్తున్నారు.

పటిష్టంగానే చేపడుతున్నాం: చందర్, *గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ డీఈ*

జంపన్న వాగులో గతంలో నిర్మించిన కాజ్‌వే కొంత భాగం కూలిపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపడుతున్నాం. వరదలు వచ్చినప్పుడు ఇది ధ్వంసమైంది. దీంతో ఈసారి మరింత పటిష్టంగానే నిర్మిస్తున్నాం. నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్నాం.

ఆనందాల హరివిల్లు

- ఘనంగా సంక్రాంతి వేడుకలు
- ఇంటింటా సంబురాలు
- రంగవల్లులతో ముస్తాబైన వాకిళ్లు
- పిండి వంటలతో ఘుమఘుమలాడిన లోగిళ్లు



ఇంటి ముందు రంగవల్లులతో చిన్నారులు

భూపాలపల్లిటౌన్, జనవరి 16: సంక్రాంతి పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా నిర్వహించిన ఈ పర్వదినం సందర్భంగా ప్రతి ఇల్లూ పిండి వంటలతో ఘుమఘుమలాడింది. వాకిళ్లన్నీ రంగురంగుల ముగ్గులతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పతంగులు ఆకాశాన చక్కర్లు కొట్టాయి. గంగిరెద్దుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హరిదాసులు ఈసారి కానరాలేదు. ఈ మూడు రోజులు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పలు చోట్లా గుట్టుచప్పుడు కాకుండా కోడి పందాలు జోరుగా సాగాయి.

సంక్రాంతి పండుగ ప్రతి ఏడాది జనవరి 14, 15, 16 తేదీల్లో వస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని తెలుగు వారంతా దీన్ని ఎంతో వైభవంగా జరుపుకుంటారు. మూడు రోజులపాటు సంబరాలు చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ చేసుకోవడం ఆనవాయితీ. సంక్రాంతిని జరుపుకొనే నెలలోనే రైతులకు పంటలు చేతికి వస్తాయి. ఈ పండుగ సందర్భంగా కొత్త అల్లుళ్లు ఇంటికి చేరుకుంటారు. బంధుమిత్రులు కూడా వస్తుంటారు. వీరికి అతిథి మర్యాదలు పుష్కలంగా లభిస్తుంది. ఇలా ఆనందోత్సవాల నడుమ సంక్రాంతిని జరుపుకుంటారు.

రంగవల్లులతో నిండిన వాకిలు

సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా మహిళలు ఉదయాన్నే లేచి ఇంటిముందు కళ్లాపి చల్లి ముగ్గులు వేసి రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ముగ్గులలో రేగిపండ్లు పోసి, నవధాన్యాలు వేసి, గొబ్బెమ్మలు చేసి పూలు చల్లారు. పిల్లలు ఉన్నవారు బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇలా పల్లెపల్లెనా ప్రతి కాలనీలోనూ తమ వాకిళ్లను చూడముచ్చటగా ముస్తాబు చేశారు. సంక్రాంతి రోజు చుక్కల ముగ్గులు, ఇతరత్రా ముగ్గులు వేసి అలంకరించిన మహిళలు, కనుమ రోజు రథం ముగ్గువేసి ఆ దేవుళ్లే తమ ఇంటికి దిగివచ్చినట్టు అలంకరించారు. తమ ఇష్టాదైవాలను ఆరాధించారు.

జోరుగా జూదం

సంక్రాంతి సందర్భంగా పలు చోట్లా కోడి పందాలు, ఎడ్ల పందాలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంస్కృతి ఉండగా తెలంగాణలోనూ అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ క్రమంలోనే పలువురు ఆన్‌లైన్‌లో జరిగే పందాలపై ఆసక్తి పెంచుకున్నట్టు తెలుస్తోంది. జూదానికి అలవాటుపడ్డ వారు దీనిపై ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ సమీపంలో ఈ సంక్రాంతికి జోరుగా కోడి పందాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగినట్లు సమాచారం.



పతంగులు ఎగురవేస్తున్న బాలురు

నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు

గత పాలకులు కోట్లు కొల్లగొట్టారు

అభివృద్ధి పేరుతో ఇష్టారీతిగా ఖర్చు చేశారు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రెడ్డికాలనీలో సమస్యలు అడిగితెలుసుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 16: అభివృద్ధి పేరుతో గత పాలకులు నిధులను గొల్లగొట్టారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఇష్టారీతిగా వ్యవహరించి కోట్లు రూపాయలను దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. భూపాలపల్లి పట్టణంలోని 1, 14, 30 వార్డుల్లో ఆయన మంగళవారం పర్యటించారు. కాలనీల్లోని సమస్యలను ఆరా తీశారు. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు సక్రమంగా లేవని, దీనికి గత పాలకులే కారకులని విమర్శించారు. గతంలో కొన్ని రోడ్లకు ఇష్టానుసారం నిధులు ఖర్చు చేశారని అన్నారు. డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్, టీయూఎఫ్ఐడీసీ నిధులు తీసుకొచ్చి పనులు చేపట్ట లేదన్నారు. దీంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. ఈ క్రమంలో పలువురు రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల విస్తరణలో నేతకానీల ఇళ్లు పోయాయని, దీంతో వారు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఇప్పటికీ పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని తెలిపారు. అంతర్గత రోడ్లు సక్రమంగా లేవని, ప్రధాన రహదారిలో వీధిదీపాలు ఇప్పటికీ వెలగడం లేదన్నారు. ఇలా అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి సకాలంలో పనులు చేపట్టి పూర్తిచేయాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఉన్న నిధులు సక్రమంగా ఖర్చుచేసేలా చర్యలు చేపడతానని స్పష్టం చేశారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో తిరిగి ఆయా సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, రంజిత్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, సాంబమూర్తి, మల్లేష్, సంతోష్, వెంకి యాదవ్, జోరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్

ఏటూరునాగారం, జనవరి 16 : విద్యారంగాన్ని పరిరక్షించి తద్వారా ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు మంచర్ల వీరభద్రం అధ్యక్షతన మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మధుసూదన్ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. జీవో 317తో నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు. ప్రమోషన్లు, బదిలీలను తక్షణమే చేపట్టాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు, జిల్లా కార్యదర్శి ఉట్కూరి రాంబాబు, మండల అసోసియేట్ అధ్యక్షుడు అడప రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్

మహాజాతర అభివృద్ధి పనులపై ఆరా



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్

- మేడారంలో వేర్వేరుగా పర్యటించిన కలెక్టర్, పీవో, అదనపు కలెక్టర్
- త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశం

మేడారం, జనవరి 16 : మేడారాన్ని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ వేర్వేరుగా పర్యటించారు. మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కూలీల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరిగతిన పూర్తి చేయా లన్నారు. జంపన్నవాగు నుంచి ఊరట్టం స్తూపం వరకు ప్రతిపాదిత పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీ1, సీ2 పార్కింగ్ కోసం సుమారు 95 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గ్రౌండ్ లెవలింగ్‌ను సక్రమంగా చేపట్టి వారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, పైప్‌లైన్ల ఏర్పాటు, మహిళలు బట్టలు మార్చుకునే గదుల నిర్మాణం, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల పూడికతీత, వాగులో ఇసుక చదును పను లను కలెక్టర్, పీవో పరిశీలించారు. మేడారం పరిస రాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక సంఖ్యలో కార్మికులను వినియోగించాలన్నారు. వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలంలో కాజ్‌వే పనులను పరిశీలించారు. అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో శాఖల వారీగా అధికారులతో చర్చించారు. ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి వరపూజ

భక్తులతో కిటకిటలాడిన హేమాచల క్షేత్రం

మంగపేట, జనవరి 16: మల్లూరు హేమాచల క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మకర సంక్రాంతి సందర్భంగా ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి వరపూజ (నిశ్చితార్థం) మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకీలో కొండపై నుంచి మూడు కిలో మీటర్ల దూరం వరకు కోలాటాలు, సన్నాయి, వాయిద్యాల నడుమ ఊరేగించారు. విశ్రాంతి మంటపం వరకు తీసుకొచ్చి అధిరోహించారు. మల్లూరులోని శంభులింగేశ్వర స్వామి-పార్వతిదేవి ఉత్సవమూర్తులను, సీతారామాచం ద్రస్వామి విగ్రహాలను అర్చకులు పక్కపక్కనే అధిరోహించిన అనంతరం వరపూజ క్రతువును నిర్వహిం చారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ప్రధాన అర్చకుడు అమరవాది మురళీకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో సుమారు నాలుగు గంటలపాటు కార్యక్రమం జరిగింది.

ముందుగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి తీసుకొ చ్చిన పట్టు వస్త్రాలు, కురవి వీరభద్రస్వామి దేవస్థానం నుంచి, హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి తీసుకొచ్చిన పట్టువస్త్రాలతో ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి వరపూజ చేశారు. భద్రాచలం దేవస్థానం అర్చకులు మదన్‌మోహనాచార్యులు, మురళీచార్యులు, రామాచార్యులు, మణీదీప్, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, కురవి వీరభద్రస్వామి దేవస్థానం అర్చకులు గణిపాటి బాలకృష్ణ, శ్రీకాంతాచార్యులు పూజ ఇత్యాది కార్యక్రమాలను నిర్వహించారు. హేమాచల ఆలయ ఈవో శ్రవణపు సత్యనారాయణ, చైర్మన్ నూతలకంటి ముకుందం, మంత్రి సీతక్క కుమారుడు ధనసరి సూర్య, ఆలయ ప్రధాన అర్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ఎం. రాజశేఖర శర్మ, అర్చకులు ఈశ్వర్‌చంద్‌శర్మ, పవన్‌కుమారాచార్యులు, అనిపెద్ది మురళీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు. సుమారు 20 వేల మంది భక్తులు హాజరయ్యారు. ఎస్సై గోదరి రవికుమార్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తును చేపట్టారు. వైశాఖ శుద్ధపౌర్ణమి రోజు మే 23న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిలతో లక్ష్మీన రసింహస్వామికి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవో, ప్రధాన అర్చకులు ప్రకటించారు.



వరపూజ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

ఏటీఎంల ధ్వంసం

- ఐదు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం
- డబ్బులు రాలేదన్న అక్కసుతో మిషన్లపై రాళ్లతో దాడి
- రూ.4.5 లక్షల నష్టం
- నాలుగు గంటల్లోనే నిందితుడి అరెస్టు
- వరంగల్ జిల్లా నర్సంపేటలో ఘటన






అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్, ధ్వంసమైన ఎస్‌బీఐ ఏటీఎం మిషన్

నర్సంపేట టౌన్, జనవరి 16 : జల్సాలకు అలవాటుపడిన ఓ కొరియర్ బాయ్ ఏకంగా ఐదు ఏటీఎంలలో చోరీకి విఫలయత్నం చేయగా, డబ్బులు రాలేదన్న అక్కసుతో ఏటీఎం మిషన్లను రాళ్లతో ధ్వంసం చేసిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. ఘటన జరిగిన నాలుగు గంటల్లోనే సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్ అరెస్టు వివరాలను వెల్లడించారు. నర్సంపేట పట్టణంలోని మాధన్నపేటరోడ్‌కు చెందిన 19ఏళ్ల మేడిద వంశీ కొన్ని రోజులుగా ఓ కంపెనీలో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు, మద్యానికి అలవాటుపడి కొరియర్‌గా పని చేస్తే వచ్చే డబ్బులు, ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపోకపోవడంతో ఏటీఎంలో దొంగతనం చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మద్యం సేవించి ఏటీఎంలో దొంగతనానికి వెళ్లాడు. ద్వారకపేటరోడ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం, వరంగల్‌రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం, నెక్కొండ రోడ్‌లోని కెనరా బ్యాంక్ ఏటీఎం, మల్లంపల్లి రోడ్‌లోని ఎస్‌బీఐ, పాకాల్‌రోడ్‌లోని కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశాడు. ప్రతీ ఏటీఎంలో డబ్బులు తీయడం సాధ్యం కాకపోవడంతో రాళ్లతో అన్ని మిషన్లను ధ్వంసం చేశాడు. సమాచారం తెలుసుకున్న నర్సంపేట సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి, హెడ్‌కానిస్టేబుల్ అక్బర్‌పాష, కానిస్టేబుల్స్ శ్రీధర్, రమేష్‌లు సీసీ పుటేజీల ఆధారంగా సంఘటన జరిగిన నాలుగు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారని డీసీపీ తెలిపారు. వంశీపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సంఘటనల్లో సుమారు. రూ. 4.05లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ తిరుమల్, సీఐ రవికుమార్, ఎస్సై రవి పాల్గొన్నారు.








హముతండాలో ట్రాక్టర్‌లో మృతదేహాలు

హముతండాలో విషాదం

నలుగురి దుర్మరణం ఘటనతో గ్రామస్థుల కన్నీరుమున్నీరు

గూడూరు, జనవరి 16: విధి వైపరీత్యం అంటే ఇదేనేమో..! జిల్లాలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. దేవుడిని దర్శించుకుని వస్తూ అనంతలోకాలకు వెళ్లిపోవడంతో హము తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ గిరిజన కుటుంబాన్ని బలితీసుకుంది. ఆటోను కారు ఢీకొని జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు, ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు మండలం హముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, అతని తల్లి పాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికతో పాటు బావమరిది సంతోష్ (సర్దార్), అత్త శాంతిలతో కలిసి నల్గొండ జిల్లా నాగార్జున్‌సాగర్ దగ్గర బుడియబాపు ఆలయానికి ఆటోలో వెళ్లారు. అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించి తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి బయలు దేరారు. మహబూబాబాద్‌కు చెందిన కారు గుంజేడు నుంచి మహబూబాబాద్‌కు వైపువస్తూ ఎదురు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లావత్ శ్రీనుతోపాటు తల్లిపాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అత్త శాంతి, బావమరిది సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. వారికి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. కాగా, మూడు సంవత్స రాల క్రితం శ్రీను భార్య సంధ్య (శిరీష) కొవిడ్‌తో మృతి చెందింది. సంక్రాంతి పండుగ వేళకుమారుడి పుట్టువెంట్రుకలు ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో హముతండాలో విషా దఛాయలు అలుముకున్నాయి. కాగా, సోమవారం నలుగురి మృతదేహాలకు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ నివాళ్లర్పించారు. జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.


కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ శ్రీను కుటుంబం (ఫైల్)

అత్తారింటికి వచ్చిన వ్యక్తిపై దాడి

తీవ్ర గాయాలపాలైన యువకుడు

పెద్దవంగర, జనవరి 16: మండలంలోని కొరిపెల్లిలో ఓవ్యక్తిపై దాడి చేయగా, తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలరానికి చెందిన తుమ్మ దీపకొరెడ్డి- మహేశ్వరి దంపతులు కుమార్తె రిషితతో కలిసి సంక్రాతి పండుగ సందర్భంగా సోమవారం కొరిపెల్లిలోని అత్తగారైన నీరటి నాగమ్మ ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసిన తర్వాత మిత్రులతో కలిసి బయటకు వెళ్లగా, పెద్దచెరువు సమీపంలో దీపకొరెడ్డిపై అదే గ్రామానికి చెందిన సాకి యాకయ్య, అతని కుమారులు సాయికుమార్, మహేష్, రాములు అనే నలుగురు వ్యక్తులు కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో దీపకొరెడ్డిని బంధువులు, గ్రామస్థులు చిక్సిత నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేయిట్ తరలించారు. అనంతరం మెరుగైన చిక్సిత కోసం హన్మకొండకు తరలించారు. అయితే పాత కక్షలతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కాగా, దీపకొరెడ్డి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న తుమ్మ దీపక్‌రెడ్డి

ఐలోని మల్లన్న.. సల్లంగ సూడు..

● మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు ● మహానివేదనతో మార్నేనియుల దేవుడి రథం ఊరేగింపు

ఐనవోలు, జనవరి 16: పూసల లాగులు.. గజ్జెల మోత.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీరకోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నొదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు.. అందులో వెలుగుతున్న దీపాల మధ్య గుంపులు గుంపులుగా జానపద గేయాలతో శివసత్తులు నృత్యాలు చేస్తున్న దృశ్యాలు.. ఐలోని మల్లన్న ఆలయంలో భక్తిపారవశ్యాన్ని ప్రతిబింబించాయి. ఇక ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు ఢమురక శబ్దాలతో భక్తులకు స్వామి వారి కృప కలగాలని స్తుతించారు. సకల భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముచ్చమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలంటూ.. పర్వతాల మల్లయ్య మా పాలిట కలిగి ఉంటూ.. సల్లంగా సూడు మళ్లీ వస్తాం..' అంటూ స్వామి వారిని వేడుకున్నారు.

పోటెత్తిన భక్తజనం

ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీక అయిన బండారితో మల్లన్న క్షేత్రం పసుపుమయమైంది. సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథంను డీసీసీబీ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్‌రావు స్వగృహంలో సుందరంగా తీర్చిదిద్దారు. మార్నేని వంశీయులు ఆధ్వర్యంలో మహానివేదనతో బయలుదేరిన రథం గ్రామ పురవీధుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళహారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభ బండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథం ప్రదర్శన సాయంత్రం 7నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీసభ్యులు సంప్రదాయపద్ధతిలో సన్మానించారు.


ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు


మహానివేదనతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్న మార్నేనియుల పెద్దరథం

7లక్షల మంది భక్తుల దర్శనం

ధ్వజారోహణం రోజు నుంచి సోమవారం వరకు సుమారు 7లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారుల అంచనా వేశారు. 17న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధవారాల్లో లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కుటుంబ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలు బహుకరించి తీర్థ ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.

అధికారుల సేవలు

జాతరలో పోలీసుసేవలు భేష్‌గా నిలిచాయి. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు నేతృత్వంలో పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాడ్ కంట్రోల్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ద్వారా సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 500మంది విధులు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలు జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. జీడబ్ల్యూఎంసీ పారిశుధ్య సిబ్బందితోపాటు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్(గ్రామ పంచాయతీ) సిబ్బంది నాలుగు రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ సునీత ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ఏర్పాటు చేసిన ట్యాంకర్లు, నల్లాలు ద్వారా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీస్‌ల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి- ఆర్టీసీ బస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు.


గజ్జెల లాగు పూసల అంగీలో మల్లన్న భక్తుడు


ఐనవోలు మల్లికార్జున ఆలయం ఆవరణలో బోనంతో నృత్యం చేస్తున్న శివసత్తి


స్వామిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ దయాకర్, కుటుంబసభ్యులు


స్వామి వారి సన్నిధిలో మాజీ మేయర్ దంపతులు స్వర్ణవరదరాజేశ్వర్‌రావు

23 నుంచి కేయూ ఇంజనీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 16: ఈ నెల 23 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 25, 27, 29, 31,ఫిబ్రవరి 2, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, డెటాసైన్స్ సబ్జెక్టులో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని ఇంజరింగ్ కళాశాల, కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

19న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, జనవరి 16: ఈ నెల 19వ తేదీన హనుమకొండ ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సెస్ బ్యాంకులో సుమారు 80 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 28 యేళ్ల మధ్య వయస్సు గల ఇంటర్, ఏదైనా డిగ్రీ చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848895937, 9700922136లో సంప్రదించాలని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


గునిగంటి తిరుపతి (ఫైల్)

ఎల్కతుర్తి, జనవరి 16: తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడి అక్కడిక్కడే గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి (42) వృత్తిలో భాగంగా తాటి కల్లు గీయడానికి వెళ్లాడు. గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చెట్టు ఎక్కి కల్లుగీస్తున్న క్రమంలో మోకు జారీ పైనుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె రక్షిత, కుమారుడు సాత్విక్‌లు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు తిరుపతి కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి

నర్సింహులపేట, జనవరి 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వంతడుపలలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి (48) గ్రామ రెవెన్యూ పరిధిలో రెండేళ్ల కిందట కోళ్లఫామ్ ఏర్పాటు చేసుకుని నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో కోళ్లఫామ్‌లో ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. తెచ్చిన అప్పులు రెట్టింపుకావడం, భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి తొర్రూరు ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జనవరి 16: మండలంలోని బోటిమీదితండా శివారు కొండెంగెలగుట్ట తండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటికను మంగళవారం పట్టుకొని స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. కొండెగల గుట్ట తండాకు చెందిన బానోత్ చిన్నమాలు తన ఇంట్లో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 కింటాళ్ల పటిక నిల్వచేసి తండావాసులకు విక్రయిస్తున్న క్రమంలో పట్టుకొని సీజ్ చేసి బానోత్ చిన్న మాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నాడు.


మేడారంలో వనదేవతలను దర్శించుకున్న భక్తులు

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారంలో భారీగా భక్తజనం

మేడారం, జనవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కిక్కిరిసిపోయింది. మకర సంక్రాంతి, కనుము పండుగల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరకొని వనదేవతలకు పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం (బంగారం) సమర్పించారు. యాట మొక్కులను చెల్లించుకున్నారు. ఈ రెండు రోజులో సుమారు 2 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా..

మాజీ మంత్రి ఈటల రాజేందర్


భీమదేవరపల్లి, జనవరి 16: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తకొండలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను కరీంనగర్ మట్టి బిడ్డనని, కరీంగనర్‌లో పలుమార్లు మంత్రిగా పనిచేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అప్పుడు పని చేశానన్నారు. కరీంనగర్ ప్రజలతో తనకు విడదీయరాని అను బంధం ఉందన్నారు. కానీ కరీంనగర్‌లో తమ సిట్టింగ్ ఎంపీ ఉన్నారన్నారు. దీంతో పార్టీ ఆదేశిస్తే ఎంపీగా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం తాము వ్యతిరేకం కాదని, కానీ దీంతో పేదలైన ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్‌గౌడ్, మాచర్ల కుమార్, అంబీరు కవిత, గోదాల సంపత్, గుండెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తా...

మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

భీమదేవరపల్లి, జనవరి 16: పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కొత్తకొండ జాతరలో సోమవారం వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలోని తమ పార్టీ న్యాయకత్వాన్ని ఎదురించి తెలంగాణను సాధించామన్నారు. తాను వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టి పబ్బం గడుపుతోందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పేరుతో ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనుకయ్య, నాయకులు ఆదరి రవిందర్, కొల్గూరి రాజు, రవీందర్, డబ్బా శంకర్, మడిపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ రుత్విక్‌సాయికి తెలంగాణ కేడర్



హనుమకొండ రూరల్, జనవరి 16: గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన కొట్టె రుత్విక్ సాయికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కేడర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ రాంనగర్‌కు చెందిన రుత్విక్‌సాయి ఐపీఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన 460వ ర్యాంకర్ పత్తిపాక సాయికిరణ్‌కు కూడా తెలంగాణ కేడర్ దక్కింది.

జై వీరభద్రా..

● భక్త జన జాతరగా మారిన కొత్తకొండ
● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్
● ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్ల రథాలు.. మేకల బండ్లు

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది.. ఎటు చూసినా క్యూలైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపొయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కుమార్, వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝా, డీసీపీ బారీ, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ దూడల ప్రమీల - సంపత్, ఎంపీటీసీ యాటపోలు రాజమణి-శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావులు ఆలయానికి వచ్చిన ఆతిథులు, భక్తులకు స్వాగతం పలికారు.

ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాడింది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝా స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ భారీ, ఏసీపీ డేవిడ్ రాజు, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 400మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేసిన పోలీసు అధికారులు తిరిగి తమ విధుల్లోకి చేరేందుకు వెళ్లారు.

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. మంగళవారం నాడు నాగవెల్లి, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

మొక్కులు చెల్లించిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడురోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 65 ఎండ్లబండ్ల రథాలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు పలువుర్ని ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వీరభద్రస్వామి


భద్రకాళి అమ్మవారు

పారిశుధ్యం భేష్

కొత్తకొండ జాతరలో పారిశుధ్య సేవలు భేష్‌గా ఉన్నాయి. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో జాతరలో అధికారుల సేవలను పరిశీలించారు. డీపీవో జగదీశ్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 150మంది కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తాచెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.


వేలేరు నుంచి వచ్చిన మేకల రథం


శ్రీవీరభద్రస్వామిని దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా


గండదీపంలో నూనె పోస్తున్న యువతులు

ఊరూరా సంక్రాంతి


ములుగులో సంక్రాంతి శోభను ప్రతిబింబిస్తున్న ముగ్గు

ములుగు కలెక్టరేట్, జనవరి 16: సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నూతన క్యాలెండర్ ఇయర్‌లో తొలిపండగ కావడంతో ఊరూరా పండగ శోభ నిండింది. కొత్త బట్టలు ధరించి ఇష్టదైవాలకు పూజలు చేశారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్పెషల్ పిండి వంటలతో ఇంటింటా ఘుమఘుమలు నిండాయి. సకినాలు, అరిశలు వంటి తీరొక్క పిండి వంటలను తయారు చేసుకున్నారు. వడ్లు, ఇతర పంట ఉత్పత్తులు ఇల్లు చేరిన నేపథ్యంలో రైతు కుటుంబాలు సంక్రాంతిని సంబురంగా జరుపుకున్నాయి. సంక్రాంతి పండగను ప్రతిబింబిస్తూ ముంగిళ్లను రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. మహిళలు వేకువజామునే వాకిళ్లను ఊడ్చి కల్లాపుజల్లి ముగ్గులు పెట్టారు. ఆయా గ్రామాలలో స్థానిక యువజన, సేవా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యువకులకు క్రీడా పోటీలను కూడా ఏర్పాటు చేశారు.

● కాటారం : మండలంలో మకర సంక్రాంతి, కనుమ పండుగల వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలంతా సోమ, మంగళవారాల్లో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పండుగ పూట మహిళలు, యువతులు తెల్లవారుజామునే వాకిళ్లను ఆవు పేడతో కళ్లాపి చల్లి ముత్యాల ముగ్గులు వేశారు. లోగిళ్లన్నీ రంగురంగుల రంగవళ్లులు, కనువిందుచేశాయి. గొబ్బెమ్మలు, నవధాన్యాలతో ముగ్గులకు మరింత కళ వచ్చింది. ప్రజలు వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, శుభాలు కలగాలని వేడుకున్నారు. పిండివంటలు, విందు, వినోదాలతో పండుగను జరుపుకున్నారు. పలువురు మహిళలు నోములు నోచుకొని తమ బంధువుల ఇళ్లకు వెళ్లి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చిన్నారులంతా మకర సంక్రాంతి వేళ పతంగులను ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. రైతులు ఎద్దులను కడిగి, వాటికి రంగులు వేసి కనుమ పండుగను జరుపుకున్నారు. వ్యవసాయంలో తమకు తోడునీడగా ఉండే పశువులను పూజించి వాటి ప్రాముఖ్యతను చాటి చెప్పారు.

● ఏటూరునాగారం : సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. వేకువజామున వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి మహిళలు సందడి చేశారు. ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను సందర్శించి దైవదర్శనం చేసుకున్నారు. ఇంటి ఎదుట రంగురంగులతో ముగ్గులు వేశారు. పిండి వంటలు, విందు, వినోదాలు జరుపుకున్నారు. గొబెమ్మలు, నవధాన్యాలతో వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయంలో తమకు తోడునీడగా ఉండే పశువులను కనుమ సందర్భంగా పూజించారు. గ్రామాల్లో హరిదాసు గానంతో సందడి పలువురిని ఆకట్టుకుంది. చిన్నారులు, యువకులు పంతంగులు ఎగరవేసి సంబరాలు చేశారు.

మంగపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటా పిండి వంటు ఘుమఘుమలాడాయి. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వెలిశాయి. మంగళవారం కనుమ సందర్భంగా కాడెద్దులకు రంగులు వేసి పూజలు చేశారు. గంగిరెద్దుల వాళ్లు రెండు రోజులు ఆటలు ఆడించారు.

పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్?

కాటారం, జనవరి 16: ఇతర రాష్ట్రానికి చెందిన గంజాయి స్మగ్లర్ కాటారం పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. మహారాష్ట్రలోని చంద్రాపూ ర్‌కు చెందిన కొందరు వ్యక్తులు కాటారం సర్కిల్ పరిధిలోని కొందరికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం రావడంతో కాటారం సీఐ రంజిత్‌రావు ఆధ్వర్యంలో ట్రాప్ చేసి ఒకరిని పట్టుకున్నట్టు తెలిసింది. మరొకరు తప్పించుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వ్యక్తి వద్ద కొంత గంజాయి దొరకగా అతడిని పూర్తి స్థాయిలో విచారణ చేసి స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో ఉన్నవారందరికీ పోలీసులు ఉచ్చు బిగించనున్నట్లు తెలుస్తోంది.

కోడి పందాల స్థావరంపై దాడులు

మంగపేట, జనవరి 16: కోడి పందాల స్థావరంపై మంగపేట పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎస్సై గోదారి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మంపేట గ్రామ పంచాయతి పరిధి అబ్బాయిగూడెం గ్రామ శివారులో సంక్రాంతి పండుగ రోజు కొందరు యువకులు కోడ్లి పందాలు ఆడుతున్న పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. రూ.2,300, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరికొంత మంది యువకులు తమను చూసి పారిపోయారని ఎస్సై తెలిపారు.

మినీ జాతరలకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


సమావేశంలో కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 16: భూపాలపల్లి నియోజకవర్గంలో నిర్వహించే మినీమేడారం జాతరలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగే మినిమేడారం జాతరలపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో చిట్యాల మండలం పురేడుగుట్ట, మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లి, భూపాలపల్లి మండలం కమలాపూర్, రేగొండ మండలం తిరుమలగిరి, వెంకటాపురం మండలం గుర్రంపేట గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించే మినీమేడారం జాతరలకు లక్షకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు సమకూర్చాలన్నారు. మహిళా భక్తుల కోసం స్నానాలు, బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. చిట్యాల మండలం వెంచరామి శివారులోని పురెడు గుట్టలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు రూ. 20లక్షల నిధులను కేటాయించినట్టు తెలిపారు. అధికారులు ప్రణాళికలు తయారుచేస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ మినీ మేడారం జాతరలకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. జాతరలు జరిగే ఏరియాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. రేగొండ మండలం కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. రేగొండ మండలం తిరుమలగిరి బుగులోని జాతర వరకు రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయాలి

టేకుమట : టేకుమట్ల- రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై వెంటనే తాత్కాలిక రోడ్డును వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించేందుకు పలు ప్రాంతాలను కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి పరిశీలించారు. అనువైన ప్రాంతాన్ని గుర్తించి వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. మేడారం మహాజాతరకు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ మార్గంలోనే వస్తారన్నారు. కూలిపోయిన వంతెన నిర్మాణ పనులు చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. వెంటనే తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ ఐదు నెలల క్రితం భారీ వర్షాల కారణంగా టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య వంతెన కూలిపోయిన కారణంగా ప్రజల సౌకర్యార్థం టూవీలర్ వెళ్లే విధంగా ఆ వంతెనపై తాత్కాలికంగా ఇనుప వంతెన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫోర్‌వీలర్‌కు దారిలేక ప్రయణికులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేస్తామని అన్నారు. అదే విధంగా కొత్తగా మంజూరు అయిన వంతెన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో అనిత, ఆర్‌అండ్‌బీ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం తహసీల్దార్‌గా ఖాజా మొయినొద్దీన్

ఏటూరునాగారం, జనవరి 16: ఏటూరునాగారం తహసీల్దార్‌గా ఖాజా మొయినొద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటూరునాగారం తహసీల్దార్‌గా పనిచేసిన స్రుజన్ కుమార్‌ను గోవిందరావుపేట తహసీల్దార్‌గా బదలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో ఖాజా మొయినొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ములుగు జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అంకిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 16: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం మంగళవారం జరిగింది. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించే జాతీయ భద్రత మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను అందరూ పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం-2024 పోస్టర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా రవాణా శాఖ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. యువకులు, వలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. డీడబ్ల్యూవో ప్రేమలత, కలెక్టరేట్ ఏవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం





గత సంవత్సరం భారీ వరదల తాకిడికి భూపాలపల్లి మండలం మోరంచపల్లి వద్ద పూర్తిగా కొట్టుకుపోయిన జాతీయ రహదారి-353 తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి దెబ్బతిని చువ్వలు బయటపడి ప్రమాదకంగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు, బ్రిడ్జికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- భూపాలపల్ల కలెక్టరేట్

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ


చీకుపల్లిలో విజేతకు ట్రోఫీని అందిస్తున్న క్రికెట్ పోటీల నిర్వాహకులు

వాజేడు, జనవరి 16: మండలంలోని చీకుపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. మంగళవారం చీకుపల్లి క్రీడా మైదానంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో కొంగాల జట్టుతో జరిగిన హోరా హోరీగా మ్యాచ్ సాగింది. చీకుపల్లి జట్టు మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది. విజేతగా నిలిచిన చీకుపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు రూ 25వేల నగదును, రన్నర్‌గా నిలిచిన కొంగాల జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 15వేల నగదును నిర్వాహకులు అందజేశారు. విజేత జట్టుకు చీకుపల్లి ఉపాధ్యాయులు శ్రీను, భిక్షపతి, జయరాం, జయేందర్, కృష్ణారావు, విఘ్నేశ్వేరరావు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు బొడెబోయిన బుచ్చయ్య, శ్రీను తమ తండ్రి బొర్రయ్య జ్ఞాపకార్థం బహుమతులు అందజేశారు. నిర్వహకులు బాలు, సాగర్, సత్యనారయణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

మంగపేట: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, మంత్రి సీతక్క కుమారుడు ధనసరి సూర్యం అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని మల్లూరులో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు బహుతుల ప్రదానోత్సవం మంగళవారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా సూర్యం హాజరయ్యారు. మొదటి బహుమతి మంగపేట, రెండో బహుమతి గంపోనిగూడెం జట్లకు నగదులతోపాటు షీల్డ్‌లను అందజేశారు. యువత అన్ని రంగాలలో రాణించాలన్నారు. క్రీడల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, ఆర్టీఐ జిల్లా చైర్మన్ బండ జగన్మోహన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ ములుగు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్డీ. ఇస్సార్‌ఖాన్, కాంగ్రెస్ జిల్లా అనుబంధ సంఘాల నేతలు అయ్యోరి యానయ్య, మారం సుమన్‌రెడ్డి, పూజారి సమ్మయ్య, కాటబోయిన నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాజేసేందుకు యత్నం

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న రైతులు

వెంకటాపూర్, (రామప్ప), జనవరి 16 : మండంలోని నల్లగుంట గ్రామానికి చెందిన రైతు ధ్యాన్యాన్ని రైసుమిల్లుకు తరలిస్తూ కాజేయడానికి డీసీఎం డ్రైవర్ ప్రయత్నించాడు. డీసీఎంను వెంబడించిన రైతులు ధాన్యాన్ని మరో వాహనంలోకి డంప్ చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన ఈఘటనపై వెంకటాపూర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగుంట గ్రామానికి చెందిన రైతు పేర్ల శ్రీనివాస్ వరి ధ్యాన్యాన్ని తరలించేందుకు అదే గ్రామానికి చెందిన చంద్రగిరి రఘుకు చెందిన డీసీఎంను డ్రైవర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. సోమవారం రాత్రి ధాన్యం లోడుతో వెల్తుర్లపల్లి మిల్లుకు బయల్దేరింది. అప్పటికే గ్రామ రైతులు అనుమానంతో డీసీఎంను వెంబడించారు. వాహనంలోని ధాన్యాన్ని మరొకరితో కలతిసి ఆటోలోకి ఎక్కిస్తుండగా పట్టుకున్నారు, వెంటనే డీసీఎం డ్రైవర్ రఘు, ఆటో డ్రైవర్ కుమార్ అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై రైతులు వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ నేతకానీలకు కేటాయించాలి

కాటారం, జనవరి 16: పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ టికెట్‌ను నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని నేతకాని సంఘం నేత, తెలంగాణ ఉద్యమకారుడు బాడిశగండు అరుణ్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. దావోస్ వెళ్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన హైదరాబాద్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. పెద్దపల్లి పార్లమెంట్ సీటు పరిధిలో నేతకాని సామాజిక వర్గం ప్రజలు అధికంగా ఉన్నారని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనకు ఎంపీ టికెట్ కేటాయించాలని కోరినట్లు అరుణ్ పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యమే ప్రధానం : డీఎంహెచ్‌వో

వెంకటాపూర్, (రామప్ప), జనవరి 16 : మహిళల ఆరోగ్యం ఎంతో ప్రధానమని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు, వైద్యాధికారుల పనితీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఆరోగ్య క్లినిక్‌లను ప్రారంభించి 19 వారాలు పూర్తి చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు ములుగు జిల్లా వ్యాప్తంగా 8,176 మందిని పరీక్షించామన్నారు. 148 మంది మహిళలను మెరుగైన వైద్య సౌకర్యం కోసం రిఫర్ చేసినట్టు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ పాషా, స్టాఫ్‌నర్సు జ్యోతి తదితరులు ఉన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి : బీఆర్‌ఎస్


కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలతో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, జనవరి 16: మహిళలు మనో ధైర్యంతో ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి అన్నారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి(పీఎస్ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 మంది మహిళలకు రూ.50 లక్షల విలువైన కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ పేద మహిళలకు 40రోజులపాటు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నిపుణుల చేత వారికి మెళకువలు నేర్పించినట్లు తెలిపారు. మహిళలు కుట్టు మిషన్ నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. పీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి మహేందర్‌రెడ్డి, ఎలిశాల రజిత, కొండి రవీందర్, సానికొమ్ము దిలీప్‌రెడ్డి, బానాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇప్పలగడ్డ వాసులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధురాలికి దుప్పటి పంపిణీ చేస్తున్న అశోక్

గోవిందరావుపేట, జనవరి 16: మండలంలోని ఇప్పలగడ్డకు చెందిన నిరుపేదలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండి చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం హామీని వెంటనే అమలు చేయాలి

కాకతీయఖని, జనవరి 16: అభయ హస్త హామీని వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు రవికాంత్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీలకు రూ.12లక్షల ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎస్సీ రిజర్వేషన్ 18 శాతం పెంచుతామని చెప్పారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని కోరారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు


పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కాటారం, జనవరి 16: బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మా యావతి జన్మదిన వేడుకలు మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సోమ వారం ఘనంగా జరిగాయి. బీఎస్పీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేష్, మండల కన్వీనర్ బొడ్డు రాజబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మాయావతి జన్మదిన వేడుకలు నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు అందించారు. బహుజనుల అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకుల్లో బెహన్‌జీ మాయావతి ఒకరని పలువురు నేతలు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్య క్రమంలో బీఎస్పీ మండల ప్రధానకార్యదర్శి మౌలానా, నాయకులు రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్ర స్వామి ఆరాధన మహోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు

ఏటూరునాగారం, జనవరి 16 : మండలంలోని ఆకువారిణ షపురంలో కొలువుదీరిన అభినవ వీరభద్ర స్వామి, భద్రకాళిల ఆరాధన మహోత్సవ వేడుకలు మూడు రోజులుగా ఘనంగా జరిగాయి. మంగళవారంలో ఈ వేడుకలు ముగిసాయి. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు అర్చకులు చౌడేశ్వర్, గంగాధర్, రాజు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామి వారిని మేళతాళాలతో మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శంచుకొని కోరిన కోరికలు తీరాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బల్ల వీరభద్రయ్య, బల్ల రాజేంద్ర ప్రసాద్, కిరణ్ కుమార్, కురుకు సాంబయ్య, పద్మ, గాజుల లలిత, ప్రవీణ్ కుమార్, నాగేశ్వరరావు, రమేష్, లక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.